# అతడు—ఆమె

అతడు విచారంతో నేలవంక చూస్తూ కూర్చొన్నాడు.

ఆమె లోపలినుంచి బయటికి వస్తూ వివర్ణుడైన అతణ్ణి చూసి నిర్ఘాంత పోయి తలుపుప్రక్కగా నిలుచున్నది.

అతని ముఖమండలము విషాదావృతమైంది. ఉష్ణములైన రెండు కన్నీటి బిందువులు నేత్రాంచలముల్లో చిప్పిలినవి. ఆమెహృదయము వీటిని చూడగానే తరుక్కుపోయింది. చీరెచెంగును నోటిలోకొఱుకుతూ వెనుకభాగానికి వచ్చి తన మృదుపాణియుగ్మంతో అతని దీర్ఘకేశాల్ని స్పృశించింది.

అతని ఊహాప్రవాహం ఆగిపోయినది. స్పర్శమాత్రాన వెనుకకు తిరిగాడు.

ఆమె విశాలనయనములు ఓర్పును శాంతిని ప్రకటిస్తూఉన్నవి. సౌందర్య రసస్ఫూర్జితమైన ఆసౌమ్యమూర్తి కళావిహీనమైనట్లు కనుపించినది.

అతని హృదయంలోనుంచి పొంగివచ్చే దుఃఖవాహినులు పైకి ఉబుకుతూఉన్నవి. మనోవ్యథలను అణచుకోలేకపోయాడు.

ఆమెశీతల దృక్స్నానములను అతనిపై బరపింది.

అతని హృదయ కోలాహలము ఒక్కమారుగ మిన్ను ముట్టింది.

ఆమె చూపుల్లోని ఆదరణా, అనిర్వాచ్యానురాగమూ, అతని హృదయంలో ప్రవేశించినవి.

అతని మనస్సంక్షోభము శాంతించినది. హృదయోద్వేగము మంత్రించినట్లుగా స్తంభించిపోయినది.

ఆమెప్రకృతిదేవతోపాసకురాలివలె నిశ్చలంగా నిలచుని ఆపురుషమూర్తి వైపు మరల నొకసారి చూచింది.

అతడు వివర్ణుడైనాడు. ముఖబింబము పాలిపోయింది. నేత్రకాసారములలో బాష్పము లుబుకుతూ ఉన్నవి.

——ఆమె ఆత్రముతో అతని పాదాలమీద వ్రాలింది.— అతనికి ధైర్యంకూడ సడలిపోయింది. కంపితకరములతో ఆమెను లేవనెత్తి అధరచుంబనముతో నాశ్వాసించాడు. ఆయానందంలో వారు ఉప్పొంగారు.

ఒక నూత్నజ్యోతిబహిర్గతమై వారి హృదయాలకు గాఢతరానురాగమూ, వారి ఆత్మలకు ఒక మహోత్కృష్ట పూజ్యభావమూ వ్యక్తీకరించినది.

—తుమ్మలపల్లి వేంకటసీతారామారావు